# పద కేళిక

నెల పొడిచింది!

ఒళ్ళు గరిపొడిచింది.—

పైన క్రమ్మెనె మొయిలు, మొయిలు కాదేమో, గగనానా గంధర్వులు,— కరవీరకోరకాల సేసలు జల్లిరేమో,— అదేనేమో లేలేత జేగురింపు!

ఆ జేగురుగుంపు,— జేజేల రాయని,— జటాజూటమేమో,— కాదో మరి— నెలవంకకు తావెక్కడ, పదారుకళల నిండుతనాన నులివెచ్చ తరితీపులు,— తెలివిందులుచేసే,— కందువ లేవంక,— అయ్యో సిగపూవుగ అమరేందుకే కద!—

వెన్నెల మిన్నేరై,— కన్నులమేర క్రమ్ముకున్నది!

కనుచూపు పొలిమేరల,— కరుడుట్టిన,— మసక,— మహాదేవుని ఆలయ గోపురమూనా,— ఔనేమో,— 'శివుడులేని చిత్తమున్నదా,— శివాలయములేని,— సీమ ఉన్నదా?'

యిదే గ్రామము?— అదిగొప్పల కావలె-కావలె; మట్టి మిద్దెలు చుట్టూగుడిసెలు,— యీ తరిపి వెన్నెల క్రమ్ముకోంగా,— స్ఫాటికమూర్తులైనది. యీ సీమ యీ శైవాస్యమే!— అందులకు,— ఎప్పటి ముచ్చటో తలచుకుని,— నవ్వుకున్నాడు!

—'చిన్నవాడా!— నీ చిత్తము శివునిమీదనే,— కాని, భక్తి భామలమీద!' అని,— తాతగారి నమ్మినబంటు చెన్న కేశవులు,— ఆ నాడు నలుగురిలో,— నవ్వుమొగం జేసుకుని మందలింపుగానో దయ్యబట్టుకున్న ముచ్చట,— శ్రీనాథుడికి జ్ఞాపకం వచ్చి,— కనుల వెంట నవ్వుకున్నాడు!

అది విన్నవారికి ముచ్చటే కాని,— తనకు చిన్నతన మనిపించింది, ఎందుచేత?—

కృష్ణా పట్టణములో,– విజయదశమి పండుగలకు,– జక్కులవారొచ్చి మేళం కట్టినారు. వారిది కృష్ణాతీరం! వెలగ వారు కమ్మెచ్చున దీసిచ్చున్నారు. జక్కుల సానులో, సాన కోకతీరు చక్కదనము! వెలసి కైమూపించు లావణ్యము; వారిలో,– జగదీశ్వరి అధిక చక్కనిది! అది,– తానన్న మాటకాదు, [illegible] సెతము తెలియూ [illegible] సె విచ్చినదే!

తనకప్పటికి నూనూగుమీసము వచ్చినది! దానిదీ,– యించుమించు తనయీడే!–

ఆనాడు,– బహుళ పంచమినాడు,– జక్కులవారు 'శివలీల' అభినయించినారు. కథ, దారుకావనక్రీడ! శివుడు, వేంకట్రాయుడు; అష్టభరతములు నేర్చినవాడు– పండితుడు; పైపెచ్చు, బ్రాహ్మణుడు; కోడెకారుతనాన,– జక్కుల మీనాక్షిని చేపట్టి,– సుఖాన ఉన్న ప్రాణి!–

రాయుడి కూతురు జగదీశ్వరి! పాక్కిలి–మాణిక్యముతో పుట్టి పడుచు! తండ్రి చెప్పిన విద్య, గోరంత దాని కబ్బినది, కొండంత! అలదాని,– రూపే గానము, చూపే,– అభినయనము,– ఏపే,– లాస్యము! అంతఃపురాంగనలందరికీ, ఆ ఠీవి లేదు; అందాలాతెక్కూ, అందరి మన్ననలూ అందుకునే మధురాధరల కంతటి పరువము లేదు,– పరువూ లేదు.

జక్కుల మేళము వచ్చినదంటే, సీమకు సింగారమే!

స్వామివారి ఉత్సవానికైనా, అంతటి సంబరమూ సమృద్ధమూ ఉండదు

జగదీశ్వరి,– ఈ కాని వేషము కట్టినది:

అదీ,– చివరకు...

అంతకు, మునుముందు,— దారుకావనిలో, నడయాడే ఋషికన్యగా, లోలగా,— ప్రౌఢగ్గా,— ఖండితంగా,— కలహాంతరితగా,— చిగురుకు,— అభిసారికగా,— ఆహారముతో బాటు,— అభినయవైఖరీ మార్చి,— ఎప్పటికప్పుడు,—ఎవరీ నాట్యసాని,— అని అందరూ,— అబ్బురము చెందేటట్లు,— వింతలూ విడ్డైములూ చూపినది! ఆ వేషము కట్టినది జగదీశ్వరి,— అని,— అందరికీ తెలిసినదే,— కాని,— క్షణానికొక తీరున గోచరించడముతో,— వారందరు వేర్వేరని భ్రాంతి, చూపరులకు కలిగినది! అభిసారికగా వచ్చి,— నాయకుణ్ణి,— పరవశింపజేసి, అతడానంద,— మత్తులో ఉండగా,— అంతలో,— ఈశానియై వచ్చి,— వాని కౌగిలి నలముకొని,— కలసి మెలసి లాస్యమాడించినది!

తాతగారు,— కమలనాభామాత్యులు,— రాయడికి,— సే ఖన గప్పినారు! ఈశ్వరుని చేరబిలిచి,— 'యీ బాలను సముచితముగా సమ్మానించుట నీకు వదలినామోయి,— అన్నట్లు,— తనవంక,— చూసినారు! తనది, నేరని తనము,— ఆపై,— ఆ తరుణాన చేతగానితనము! తనకు తానలవిమాలి,— చేయూడక,— కనులార మ్రొక్కినాను! ఈశ్వరి,— తెల్లబోయి వెనుకంజ వేసి, వెనుదిరిగి నడచిపోయినది! ఆ వయారి కనుచాటైనది, తాను గమనించేస్థితిలో లేదు! తాతగారు, తన మనుమడు,— యీ యీడుకే సరసుడయినాడనుకున్నారేమో!— మేలుగా తలయూచినారు! చెన్న కేశవులు,— ఆ పొల్లుమాట ఆడినాడు! సభలో బలసికూర్చున్నవారు,— కలకలలాడినారు! తనకు కనువిప్పు చేసినారు!

ఈశ్వరి,— మరి,— మేళము కట్టలేదు!

మరునాడు,- రాయడు తాతగారి సముఖానికి వచ్చినాడు!

మీ మనుమని మరియాదలో,- మా బాలకు మ పోయినదా! అనినాడు:

తాతగారు,- అది రాయడి నెరజాణతన మనుకొని,- ఆహా!- అని మజ్జాయించి,- మా చిన్నవాడంతటి నవమన్మథుడనుకొన్నదా, - మీ బాల? - అని చిరునవ్వు గునిసి, - 'రాయడూ!- పరువున బుట్టి,- గౌరవాన పెరిగి,- రసికరాజుల మన్ననలనందిన, పరుల యింటి ఆడబడుచును యీ ముదుసలి- యిలా పరిహాసిస్తూండటం తగునా,- అనుకుంటున్నావా?- అది కాదోయీ,- కాబోయే మనుమరాలని...'

రాయడు పరశురామునివలె ఘూర్ణిల్లి,- అంతలో వినయ మలవరచుకొని,-

'అమాత్యశేఖరులు సెలవిచ్చినది,- యీ అజ్ఞానికి అవగతము కాలేదు!' అని పెదవిబిగింపున పలుకగా,- తాతగారు ఒక నవ్వు నవ్వి,- రాయడూ,- నీ యెదుట నా నియోగము సాగలేదు! రవంత గడుసుతనాన పోయి,- నీకు కనుకినుక కలిగించినాను! గమనించినానులే! అల్లుడా,- మీ చిన్నది,- మాకు మనుమరాలయ్యేనని,- మే మనినది,- మాట త్రుళ్ళికాదు! మనసారా వాంఛించినదే!

ఏమోయీ,- మా పట్టణానికి,- మీ రాకపోకలు,- యీనాడు మొదలైనవా?

మా ఆదరణ,- మా అభిమానమూ,- నీకూ,- నీవారికీ సరిక్రొత్తదా?-

మా సీమలో,- ప్రాయపువారు,- కళారసికులు కాని,- కనువెదుకున అసురసురయే;- సామాన్య కాముకులు కారు!

యింతకాలము,— నీవు యీపాటి గమనించనే లేదా?-

మా మనుమడు,- మీ పరువును,- ప్రాభవమునూ చులకనజేసి,- మీ బాలను,- గాంధర్వాన చేకొని,- కమనుడై కాపురముకట్టే ననుకున్నావా?-

అందులకు మే మామోదించే మనుకున్నావా?-

మీకు పరువుకానిది,- మరొకరికి పరువయేనా!

రాయడూ,- నీ కుమార్తెను,- మా చిన్నవానికి యిచ్చి, సలక్షణంగా, వివాహము జరిపించవలసినదిగా, - నేనై కోరుతున్నాను:

అల్లుడా,— మనకూ,- మనకు యీనడుమ రాకపోకలంతగా లేవుకాని,- మన బాంధవ్య మీనాటిదా? శారదా దేవి కటాక్షము సంపూర్ణముగ లభించిన అదృష్టశాలివి! నీతో మా మారన్న వియ్యమందటము, మా యిలువాసికి ఘనత. మీ కన్యకు,- మావానిని తలదన్నే వాడు దొరకడని కాదు; కాని,- సాటివాడను,- చేజాచినాను,- దయచూడవోయీ!-...'

తాతగారంతటివారు- అలా ప్రాధేయపడటం,- అందరికీ అబ్బురమనిపించింది; తనకు మరీ వింతగా తోచినది! తానా కన్నెను ఆ తీరున జూచినది లేదు! తనకు ఏ కామూనా లేదు, మరి.— ఆయన వాక్కు- ఫలించేనా,—

రాయడు పసివానివలె రోదనము చేసినాడు,

అయ్యా!- నన్ను హింసించకండి!- నేను ఏ అదృష్టా

నికి నోచలేదు.- మా- ఈశ్వరికి,- వేదురెత్తినది- మన మాట లేదు,- మన లోకము కాదు,—'

తాతగారు,- ప్రాన్పడి,- 'ప్రయోగమేమో?' అని తనలో తాననుకొనగా,- కాదు,- ఆ రక్ష మాకున్నది! యిది దైవప్రభావమే!' అని రాయడనగా,- తామందరూ,- తరలి పోయి,- వారి విడిదికి చేరుకొనంగా - అచట గోచరించినది,- చివురుబోలిన చిన్నది కాదు, కొదమసింగము! ఆ గర్జన అల్లంత మేరా,- మారుమ్రోగుతూ ఉండెనే!-

కాళ్ళేతు లాడకుండ,- కదలిపో వలనుగాకుండ, కట్టి వేసినారు! అయినా, కదలిపొంగులో చంద్రబింబమే!-

అందరి చూపులలోనూ, జాలి, వెల్లువ కట్టినది!
తనకు మాత్రము. అయ్యో పాప మనిపించలేదు!
పంచెవన్నెల చిలుక పంజరాన చిక్కినట్టున్నది-
పంజరమా?- అష్టదళ పద్మమా?-
శుకమా? - కింశుకమా?-

కలల నిండి,- కనుల నిండ కలయుబర్విన మందార వనము-

మందార వనములో మాణిక్యవీణె!
అహో! అని, తనకు వినిపించినది కాదా?
-అంతలో ఆ శివము సన్నగిలిపోయినది!

చిన్నదాని మోమున వెన్నెల చిగురించినది-పంజరాన చిలుక ఏ తీరున పలికినది?...

'— వేదాల బాలింతరాలా!- నీవు, వెనకయ్య అయ్యలో చెరిసగము కావు; అయ్య సిగపూవులో అమ్మ

కమ్మ నీవు, అలబేసికంటిలో అసలమ్మ తాను!—

'మంచు సుబ్బలిమీద, మాతల్లి! నీవు, మంచి ముత్యాలల్లు మాలలైనావు—ఆ మాల పొగడపూమాలగ మార,— నీమాల తెలివేల్పు నెయ్యుడై నాడు!—'

యిప్పు డిదేదో,— అలివిమాలిన ఆనందము.

—యింతకు ముం దలముకొన్న ఆవేశము లేదు—

ఆ వాలకము చూసి,— అందరూ తేరుకున్నారు,—

కాని,— ఎవరూ చేరబోరే! —

కాళ్ళకూ, ముంజేతులకూ,— వేసిన ఉచ్చులు,— తాను తీసి వేసినాడు: అంతలో ఆ బాలకు ఎక్కడలేని అలసటావచ్చి— నిలువలేకపోయినది, తానే సందిట పట్టుకొన్నాడు! తనువు సోకంగనే, మనిషివలె బిడియపడినది! కాని,— మనిషి కాదది, మంచుకొండ!— తాను గజగజ లాడిపోయినాడు: అడుగు, తనంతట వెనుకాడినది!

తాతగారు,— పలుకరించినారు,—

'ఏవమ్మా!— బడలిక చేసినదా?'

'తీరినది!'

'మేలు!'

'మేలుకొన్నాను!— మీ రింక నిదురపోండి!—'

'పవలు నిదురా?—'

'పవలు నిదురిస్తే,— రేయి కనువిప్పుతుంది: కను రెప్పలు చీకటికప్పుకు,— గగనం అంబరమైతే,— అంబరమే సంబరమై డమరునాదం పడితే,— ఆ ఎమరచి,— కైలాసం,— తాండవమే మొదలిడితే—' ... అని డమరుకరవళి ఉప్పతిల్లే తీరున పెదవులు

చెకుముకిలాడించి,— చెక్కులు పూరించి,— పిడికిట గుమ్మలించి శంఖనాదం రాపాడించింది:

తాతగారు — ఆహా పారవశ్యంలో, ఉన్నారు:

అనుసరించి వచ్చినవారి కనుదమ్ముల కానరాని,—కాంతి, నివురుమాటున పిక్కటిల్లినది:

తనకు,— ఆ పారవశ్యము లేదు—

ఆ బాలతీరు, అబ్బురమనిపించలేదు—

తీవెనున్న పూవు, నిగనిగల వగలు బోయి పలుకరించి నటులు,— ఎలమావికొమ్మ చిటారున ఉన్న కోయిల,— తటాలున ముంజేతిని వ్రాలి,— మురిపెము జూపించినటులు,— జాబిలిలో, చూచాయగా తోచే కుందేటికూన,— తన ముందర కుప్పించినటులు,— అనిపించినది: ఆ చిన్నది,— నీరెండబోసుకొన్న కనకగిరి శృంగమైనది, ఆ అపరంజిని: వెలుగులు కరువున బోసి,— రూపొందించ,— తన కౌగిలి కందీయ తమకాన ఉన్న తీరున తోచినది; అంతలో,— ఆ చిన్నారి,— శివదేవుని సిగ పూవై,— సామేన నొదిగిన సర్వమంగళ దరహాసమై;— అల్లంతలో,6 బుసకొట్టే, నాగకేయూరమై కనిపించినది— కాని,— తన మనస్సు,— గాలితాకిడి లేని తావున ఉంచిన జ్యోతి—

శంఖనాదం పట్టి,— యీశ్వరి,— రిమరిమ లాడిపోయి,— మొయిలు గోరాడిన తీరున,— నడకల హుంకరించి,— పున్నమి ప్రొద్దుల సంజవెన్నెలల్లే,— నిలువు నిలువూక నవ్వుగా కలకల లాడి,— ఎదుట నున్న వారందరినీ పొమ్మనినటుల గర్జనచేసింది: అందరూ,— అడుగు వెనుకాడించినారు: తాను కదలలేక పోయి నాడు: యీశ్వరి,— చేరవచ్చి,— చేజాపి చేయొడిసిపట్టి,— కంటె

కాటుక కొనగోట తీసి,– (శ్రీ)కారము జుట్టి,– వయారముగ చెక్కిలి తట్టి,– ఒక్క తాపు వేసి,– పొమ్మని తల విసరి,– తన బుజాన సేలువు మీాదికి విసిరి – పకపక నవ్వి,– తనలో తానై నది.

ఆ (శ్రీ)కారము, తన కవనానికి తలకట్టు,–

ఆ సేలువ,– తనకే సార్వభౌముడూ,– చేయనోచని సమ్మానము!–

ఆ పకపక,– సాహితీ సమరాంగణాన, తనకు, విజయ దామమైన దీవెన:...

– ఆనాటినుండి, నేటికీ తనత్రోవ తనదే,–

తాను ప్రజలలో పడినాడు,–

కాని,– ఈశ్వరి,– సామేనుసాని దేవర. నిండుతనం, తానై,– తనకుతానై,– నవ్వులోడుతూ ఉన్నది.

ఉన్నదట!–

యిక్కడే.—

,పుట్టినదెక్కడ?– ఏవాడలో,– ఏవాడనుగాని,– ఎవ్వా రికిగాని– వాని దీవెనగా: పెరిగినది,– వాని విద్దెలో,

పరువమందినది,– వానికిగా,–

అవ్వానికి కాని తానై,– చిగురుకు,– అవ్వాడే తానై జడలుకట్టి,– ధూళిక్రమ్మి,– మొయిలును జీల్చి మెరుపై,– అంబర మొల్లని– సంబరమై,– యీా సీమకు దీవెనగా,– ఇకా కడ నడయాడేనట!

ఆనాటి కీ నాడు,– వేయి పున్నములా యే–

రాజసాలవారు,– తనకై తను కనకధారా స్తవము లిచ్చి

నారు: సామాన్యులు,— చేరువకు రావెరచి,— అల్లంత దూరమున నిలిచి,— ఏ డొక మహాకవి,— అని,— చెంపపెట్టు పెట్టినట్టు — మనమున మెచ్చుకొనినారు: కాని, ఈశ్వరి మానానందము,— తన కేది?—

పాలకీ లెక్కినాడు ;

కైవారము లందినాడు:

కాని,—

సంజవేళల కెంపుతళుకు లెగజిమ్మ,— జడలూగగా,— ఆనందతాండవ కేళినున్న వైభవ మెక్కడ,— తన ప్రాభవ మెక్కడ? తాండవమే తానైనది యీశ్వరి, తాను, తాటియాకుల గిలికి,— మేటులు కట్టువాడు: యీశ్వరి కాలికున్న జవజవ,— తన పైడిగంటమున కీజన్మమునకు తరమయేనా,— వరమయేనా,— కాదు!

ఆనాడు,— యీశ్వరి జక్కుల పడుచు

రీవులు దేరువారు,— చూపులు విసరినారు,—

మానాన కముచుకొన్నారు:

ఆ ప్రొద్దుల కన్నెతనమునకు,— రవల తులదూగించ ఆయత్తపడినారు!

తాతగారంతటి,— పరువెరిగిన,— పెద్దరికాలవారు,— నాగవల్లీదళము,— తొడిమిత్రుంచి,— చెక్కిలిసోక విసిరినటుల,— మాటల సరసా లాడినారు: ఆ బాలను పాపము,— తన కుంకువ జేసినారు: ఆ ముదుసలి, ఆ నెరదాత నోటివాక్యాన,— ఆ జవ్వని,— తనువందినందులకు,— ఏని కొక్క నిమేషమాత్రము,— మానసిక బాధ నశియించుకుని,— ఆపై పైచూపై పోయినది:

తాతగారు సుఖులై ఉన్నంత కాలమూ మనసున తోచినపుడెల్లా,- అయ్యోపాప మన్నంత జాలిగా,- అహా భాగ్యమని యీశ్వరిని, తలచుకొనేవారట:

యిప్పుడు,- రాయడి కూతురు కాదు,- ఆబాల

ఆ క్షణానే లేదు,- ఉన్నది బాలేందు శేఖరుని,- క్రీనీడ:

ఆమె దర్శనానికి తాను వచ్చినది:

చిక్కని చీకటిలో,- వెలుతు రొలకబోసినట్లున్నది,- గ్రామం;- ఆ రేయికి,- ఎవరి పంచనో తలదాచికొన మనసు పడక,- దారికి ప్రక్కనే పచ్చికమీద,- అదమరచినాడు:

తెల్లవారి -

వాగులో నిత్యాచమనము జేసి,- ఊరిమీదకు అడుగు సాగించినాడు:

వాయుదేవుడు,- వీధులూడ్చి,-

ఉషో దేవి,- జడి జల్లంగా,-

ఆలయ ప్రాంగణమువలె నున్నది,- గ్రామము:

-ఎదుటనే ఆలయము:

విష్ణాలయము! గోపురము చిన్నది,- గోపురపు కొమ్మెక్కిన కోతిపిల్ల,- నేవళము మీద నున్నది:

తన మీదకు ఉరికి,- చెవిదగ్గర కిచకిచలాడి,- చేజాపి దారి చూపినది! తాను,- నడచిపోతున్నాడు,-

ఎవరో,- పూజారి వారి కోడలు,-

పూర్ణకుంభముతో, ఎదుట కానవచ్చినది,

తనను చూసి.- దారికి ఎదురు నిలిచి పలుకరించినది-

'పొరుగూరివారా?-'

'మరీ అంత పొరుగు కాదు:- మనది,- యిరుగు పొరుగే,—'

వైష్ణవులా-

పై,- పై- సిగలో పూలుంచుకున్న చిన్నారిని చూసి,- ఔరా, అనుకునే చిరు-వైష్ణవమే,- కాని,-ముదురనీయలేదు,-

'చిగురుకున్న తొగరు పండుటాకు కుండేనా?-

'పండి వడ్డింతునా?-—

'అన్నహితవు లేదు-'

'అలాగా,- ఆకారవైభవం జూసి,- ఆకలికి తాళలేరేమో,- అయ్యోపాప మనుకున్నాను: పోనీ,- మా లోగిలి నంటిన ఆవరణలో మస్గైన తావున మల్లెపందిరున్నది: చేరువనున్న కొమ్మను చిలుకపంజర మున్నది: నడచి నడచి బడలినటు లున్నారు,- సరసనే వచ్చి,- ఓపినంతసేపు సేద దీర్చుకొనరాదా,-'

'గురుతుంచుకునేను-

మరోసారి గురితించేను —'

అని మొగముజూసి చిరునవ్వి,- ముందుకు సాగినాడు-

'హనుమా,- ఎవరన్నా యీజాణ!' అనినాడు

హనుమ కిచకిచలాడినది-

అంతలో,- ఊరిమీదికి సుడిగాలి వచ్చినది-

గాలి కాదు- గాలి రేపని ధూళి,-

ధూళి కమ్మిన చంద్రబింబము-

వేయి,- చిలుకల స్వరమేళ,-

ఆ నవ్వు పెట్టుకు,- వెనుకటి జన్మలన్ని తరించినవి.

యీశ్వరి!.-

యీశ్వరా.- యీశ్వరుడా.-

ఆ అట్టహాసము,- తన నలమికొన్నది-

ఆ కన్నులు తన నావరించినవి:

ఆ కానరానితనము తన నావహించినది,-

తాను గాని,- తాను శివోహ మ్మనినది...

తన కనులు,- విచ్చుకున్నవి: ఎదుట యీశ్వరి లేదు.- హృదిని ఈశ్వరు డున్నాడనినంత నిండుతనము ఉన్నది.

తనకు కాని త్రోవను పడిపోవుచుండే.- తరుణాన ఏదో వేళకు,- వల్లభరాయడు,- పాలకీలో ఎదురైనాడు.- ప్రణమిల్లినాడు. తన కాందోళిక లేదేమా అని తల్లడిల్లినాడు:

మా వినకొండకు,- దయచేయవసినాడు,-

—చేయుమనినాడు,-

పోనీ క్రీడాభిరామము మనవి చేసుకొందు నాలకించేరా, అనినాడు!

రాజుకు వినుకలిచేసి,- వరాలంగాకో.- అనినాడు:

కంటనైనా చూడరా? అని బ్రతిమాలినాడు.

ఈ కంటనా,- ఊహు,- వెనుకటి జన్మలో,- ఏమో - యికముందు.- చూడతగినది లేదు- చూడవలసినదీ లేదు,- మరి, పలుకరించక పాలకీ ఎక్కి,- నీదారిని నీవు పో—

వల్లభరాయని పాలకీ కనుమాయైనది,-

శ్రీనాథుడు,- మోకరిల్లి;- యీశ్వరిని తలచుకొని,- నేల మీద అరచేతులు మోపి,- కళ్ళకద్దుకొనినాడు: అంత వరకూ వెంటనున్న కోతికూన,- ఎగిరి ఎటో పోయినది: గ్రామం కన్ను దాటిపోయినది-

యీశ్వరి కన్నుల గట్టినది.